సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం | 5 | జూలై | 2023



గంజాయి పట్టివేత

గంజాయి రవాణా చేస్తున్న ముఠాను చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. - 8లో



ఆకర్షిస్తున్న బుద్ధవనం

బుద్ధవనం బౌద్ధ పరిశోధకులను ఆకర్షిస్తుందని బుద్ధిస్ట్ ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం

33° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రమాదకర ప్రాంతాల్లోని పిల్లలను గుర్తించాలి

భువనగిరిటౌన్: ప్రమాదకర ప్రాంతాల్లోని పిల్లలను గుర్తించి సదుపాయాలను కల్పించాలని, వారు పాఠశాలలకు వెళ్లేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్‌పై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పనులకు వెళ్లే ప్రాంతాలను గుర్తించి, తగిన విధంగా కార్యాచరణ రూపొందించుకొని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి అన్నపూర్ణ, ఏసీపీ వెంకటరెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులు, పోలీస్ అధికారులు మహేందర్‌రెడ్డి, సురేష్ కుమార్, పోలీస్ సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఇందుమతి

యాదగిరిగుట్ట రూరల్: ప్రభుత్వ పథకాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఇందుమతి, ఆర్డీడీ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి గ్రామం రామాలయ ప్రాంగణంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో కార్మికులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న గౌరాయపల్లి, సాధువెల్లి, రాజపేట, బొందుగుల, నమిల తదితర గ్రామాలకు చెందిన చేనేత కార్మికులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న త్రిఫ్ట్ పథకం, చేనేత మిత్ర, చేనేత బీమాతోపాటు, కార్మికులకు జియో ట్యాగింగ్ వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీ విద్యాసాగర్, ఫీల్డ్ ఆఫీసర్ కిషన్ నాయక్, సర్పంచ్ సిరికొండ సత్యనారాయణ, శ్రవణ్, సిద్దిరాములు, కార్మికులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ నేడు ప్రారంభం

భువనగిరి: మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి షెడ్యూల్‌ను విద్యాశాఖ ఈ నెల 3వ తేదిన విడుదల చేసింది. ఆన్‌లైన్ వెబ్ బేస్డ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు ఈ నెల 5వ తేదీ నుంచి జరగనున్నాయి. ఇందుకు సంబంధించి schooledu.telangana.gov.in వెబ్ సైట్‌ను సంప్రదించాలని ఇప్పటికే విద్యాశాఖ ప్రకటించింది. ఈ బదిలీలు పాత జోన్ల ప్రకారమే జరగనుంది. బదిలీల ప్రక్రియ ఈ నెల 29న పూర్తి కానుంది.

జిల్లాలో 7 మోడల్ స్కూల్స్..

జిల్లాలో 7 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో 87 మంది పీజీటీలు, 34 మంది టీజీటీలు, ఐదుగురు ప్రిన్సిపాల్స్ ఉన్నారు. వీరితో పాటు ఆయా పాఠశాలల్లో పీఈటీలు, ఆపరేటర్లు కలిపి 9 మంది ఉన్నారు. వీరందరూ బదిలీ కావడానికి అర్హులుగా ఉన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం నిత్యపూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి ఆకుపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. ఆంజనేయ స్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అలంకరించారు. ఇక యాదాద్రి ప్రధానాలయంలో ఉదయం నుంచి, సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాతం, ఆరాధన సేవ, అభిషేకం, శ్రీ సుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడుసేవలు, గజవాహన సేవ, బ్రహోత్సవం విశేషంగా చేపట్టారు. ముఖ మండపంలో ఉత్సవ మూర్తులకు సువర్ణ పుష్పార్చన జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ విభాగాల ద్వారా స్వామి వారి నిత్య ఆదాయం రూ. 15,99,166 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆదరణ ఎలా ఉంది!

పూర్తయిన బీజేపీ స్వల్పకాలిక విస్తారక్‌ల క్షేత్రస్థాయి పరిశీలన

- బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు, మోర్చాలతో పలు దఫాలుగా సమావేశాలు
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సర్వే
- పార్టీ కేడర్‌లో విభేదాలు ఉన్నట్లు గుర్తింపు
- నేడు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి నివేదిక అందజేత



చౌటుప్పల్‌లో నిర్వహించిన మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, చిత్రంలో విస్తారక్‌లు చైతన్య, చంద్రశేఖర్ తదితరులు

సాక్షి యాదాద్రి: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజలను నేరుగా కలిసేందుకు భారతీయ జనతా పార్టీ స్వల్పకాలిక్ విస్తారక్‌లను రంగంలోకి దింపింది. వీరంతా మున్సిపాలిటీలు, మండలాల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేశారు. బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు, వివిధ మోర్చాలతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి, పార్టీ స్థితి ఏ విధంగా ఉంది..? జాతీయ నాయకత్వ నిర్ణయాలను అమలు చేస్తున్నారా..? కేంద్ర పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్నారా..? అనే అంశాలపై చర్చించారు. గత నెల చివరి వారంలో వచ్చిన విస్తారక్‌లు జిల్లాలో పార్టీ వాస్తవ పరిస్థితులను రాష్ట్ర జాతీయ నాయకత్వానికి చేరవేయనున్నారు. తదనంతరం అనుసరించాల్సిన వ్యూహంపై బూత్ కమిటీలకు, శక్తి కేంద్రాలకు, వివిధ మోర్చాలకు సూచనలు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన విస్తారక్‌లు తమ నివేదికలను బుధవారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి అందజేయనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 16మంది విస్తారక్‌ల పర్యటన

జిల్లాలో పార్టీ విధానం, కేంద్ర పథకాల అమలు, ప్రజలు ఏం ఆశిస్తున్నారు, పార్టీ స్థానిక నాయకత్వ పనితీరు తదితర అంశాలపై సమగ్ర విధానాన్ని తెలుసుకోవాలన్న ప్రధాన లక్ష్యంతో విస్తారక్‌లను కేంద్ర నాయకత్వం జిల్లాకు పంపించింది. ఆయా నియోజకవర్గాల్లో పర్యటించడానికి 565 బూత్ కమిటీల్లో ఆలేరులో 309, భువనగిరిలో 256 కమిటీలు ఉన్నాయి. జిల్లా మొత్తానికి 16మంది విస్తారక్‌లను కర్నాటక నుంచి పంపించారు. ఇందులో 9 మంది విస్తారక్‌లు భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో తమ క్షేత్ర స్థాయి పర్యటనను పూర్తి చేశారు. మిగతా ఏడుగురు విస్తారక్‌లు మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో పర్యటించారు.

నేడు నివేదిక సమర్పణ

జిల్లాలో విస్తారక్‌లు సేకరించిన సమగ్ర నివేదికను కేంద్ర నాయకత్వానికి అందజేయనున్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి జిల్లా నుంచి వారు సేకరించిన నివేదిక అందజేస్తారు. అనంతరం ఇదే నివేదికను భోపాల్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయానికి అందించనున్నారు.

లోటు పాట్లు గుర్తింపు..

జిల్లాలో పార్టీ పటిష్టతకు కేంద్ర నాయకత్వం ఇస్తున్న విధి విధానాల అమలులో లోటు పాట్లు గుర్తించారు. ప్రతి మండలంలోని సుమారు 10 గ్రామాలను సందర్శించారు. కొన్ని చోట్ల పనితీరు సంతృప్తి కరంగా ఉండగా, మరికొన్ని చోట్ల అధ్వానంగా ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా శక్తి కేంద్రాలు, బూత్‌సంపర్క్ కార్యకర్తల పనితీరు ఎలా ఉంది.. మెరుగు పడడానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలను కలిసి పార్టీ పనితీరుపై క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కొన్ని మండలాల్లో బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు ఇంకా వేయకపోగా.. మరికొన్ని చోట్ల కాగితాలకే పరిమితం అయ్యాయని గుర్తించారు. బూత్ కమిటీలు కూడా కొన్ని చోట్ల నామమాత్రంగా, మరికొన్ని చోట్ల మొత్తమే లేవని గుర్తించారు.

బయటపడ్డ విభేదాలు..

విస్తారక్‌ల పరిశీలనలో స్థానిక నాయకత్వంలోని అంతర్గత లోపాలు బయటపడ్డాయి. అదేవిధంగా పార్టీ విధానం ఎలా ఉంది. కేంద్ర నాయకత్వం చెప్పిన విధంగా స్థానిక నాయకత్వం పనితీరు సాగుతుందా.. అనే విషయాలను క్షేత్ర స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. పార్టీ కేడర్ గ్రామ స్థాయిలో పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాలు చేపడుతున్నారా..? లేక మొక్కుబడిగా చేస్తున్నారా..? అనే విషయాలపై దృష్టి సారించారు. గ్రామాల్లో ఉన్న వివిధ వర్గాల పెద్దలను, మేధావులను కలిసి పార్టీ పనితీరు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుతోపాటు బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు తీసుకున్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



వ్యవసాయాధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి, యాదాద్రి: జిల్లాలో పంట సాగు వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ 15 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఏడీలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో రైతుబంధు, రైతు బీమా, పంట వివరాలు నమోదు, ఎరువులు, విత్తనాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు 10వేల ఎకరాల్లో వరి నాట్లు జరిగాయని, ఇంకా 1,78,607 ఎకరాలు వరి నాట్లకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పత్తి పంట లక్షా 127 ఎకరాల్లో, కందులు 180 ఎకరాల్లో, మిగతా పంటలన్నీ కలిపి 8వేల ఎకరాల్లో సాగు చేశారన్నారు. వివిధ రకాల నీటి వనరుల కింద సాగైన పంటల పూర్తి వివరాలను 15 రోజుల్లోపు ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఎరువుల పంపిణీలో క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతుబంధుపై జిల్లాలో 2,66,881 పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయని, 18,611 పాస్ పుస్తకాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వీటిని ఈనెల ఏడవ తేదీలోగా డాటా తీసుకొని రైతుబంధు పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. జిల్లాలో 20 రైతుబీమా పెండింగ్ కేసులు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన పత్రాలతో రెండు రోజుల్లోపు అప్లోడ్ పూర్తి చేయాలని సూచించారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



దొడ్డికొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా 2017 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 32 వేల మంది లబ్ధిదారులను గుర్తించి 19 వేల మందికి గొర్రెల యూనిట్లను గ్రౌండ్ చేయడం జరిగిందని, ఇందుకు రూ.232 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించుకున్న తరువాత మహనీయులను గౌరవించుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగానే దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య తెలంగాణ తొలి అమరుడని, దొరలు, భూస్వాముల దౌర్జన్యానికి ఎదురు నిలిచి తన ప్రాణాలర్పించారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బీరు మల్లయ్య, అనురాధ, జిల్లా గొల్ల కురుమ సంఘ అధ్యక్షుడు గవ్వల నర్సింహ, పేరపు రాములు, సత్యనారాయణ, ప్రతినిధులు మహేందర్, బాలరాజు, కొడారి వెంకటేశ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి రూ.15.50 కోట్లు

- జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరిటౌన్: జిల్లాలో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆర్థిక, ప్రణాళిక, పనుల స్థాయీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. డీడీ కట్టిన రైతులకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలన్నారు. వివిధ గ్రామాల్లో బీటీ రోడ్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న బస్వాపురం ప్రాజెక్ట్ పరిధిలోని కాలువ పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.15.50 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

విద్యా, వైద్యానికి సంబంధించి మధ్యాహ్నం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పనితీరు ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. మన ఊరు – మన బడి కింద పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్ మాట్లాడుతూ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నిర్దేశించిన అన్ని పరీక్షలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఆస్పత్రులపై పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది డ్యూటీ సమయంలో సొంత పనులు చేసుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

10 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



డీఈఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

భువనగిరి: పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10 నుంచి మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి డీఈఓ నారాయణరెడ్డి, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డిలకు వారు సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం ఇమ్రాన్ మాట్లాడుతూ వంట కార్మికులకు 9 నెలలుగా బిల్లులు రావడం లేదన్నారు. 2022లో గౌరవ వేతనానికి సంబంధించి ప్రకటించిన జీఓ నేటికీ అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఈ నెల 10 లోపు కార్మికుల ఖాతాలో వేయాలని, లేకుంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్‌బాబు, జిల్లా కమిటీ సభ్యులు దాసిర లక్ష్మయ్య, కార్మికులు వసంత, పారిజాత, అనసూర్య, సంధ్య, లక్ష్మి, నిర్మల, సునీత తదితరులు ఉన్నారు.

ఫైన్ వేస్తున్నా పట్టింపు లేదు!

- మద్యం సేవించి వాహనాల డ్రైవింగ్
- ఆరు నెలల్లో 2,275 కేసులు, 110 మందికి జైలు శిక్ష



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

యాదగిరిగుట్ట : జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని ట్రాఫిక్ పోలీసులు పదేపదే చెబుతున్నా చాలా మంది వాహనదారులు వినిపించుకోవడం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారితో పాటు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పలు ప్రమాదాలకు కారణం డ్రంక్ అండ్ డ్రైవ్ కారణమని తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన ట్రాఫిక్, సివిల్ పోలీసులు సాయంత్రం 5గంటల నుంచి 6.30గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రి 8గంటల నుంచి 10 గంటల మధ్యలో చేస్తున్నారు. ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారు. వీరికి జరిమానాలు విధించడం, కౌన్సిలింగ్ ఇవ్వడం, జైలు శిక్ష విధించడం జరుగుతుంది.

యాదాద్రికి భక్తులు అధికంగా వస్తుండడంతో..

ముఖ్యంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి జంట నగరాలతో పాటు వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు అధికంగా వస్తుంటారు. వీరంతా శ్రీస్వామిని దర్శించుకొని పాతగుట్ట ఆలయం వద్ద వన భోజనాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు కొంత మంది మద్యం సేవించి వెళ్తుంటారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా, హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న భువనగిరి మండలం గూడూరు టోల్ ప్లాజా వద్ద సాయంత్రం నుంచి రాత్రి సమయాల్లో నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో ఎక్కువ మంది పట్టుబడుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. ఏదైనా ప్రాంతానికి వెళ్లినప్పుడు మద్యం సేవించకుండా ఉండే డ్రైవర్‌ను తీసుకెళ్లాలి. ఫంక్షన్లలో మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎదుటి వాహనదారుడికి, పాదాచారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాహనదారులు, యువతకు అవగాహన కల్పించి, కౌన్సిలింగ్ ఇస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కోర్టు ఒక రోజు నుంచి 14 రోజుల వరకు జైలు శిక్ష, రూ.వెయ్యి నుంచి రూ.10వేల వరకు జరిమానా విధిస్తుంది.

– లక్ష్మీనారాయణ, యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఎస్‌ఐ

కౌన్సిలింగ్‌లు, అవగాహన సదస్సులు..

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి ట్రాఫిక్ పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ఆయా కళాశాలలు, బస్టాండ్, ప్రధాన కూడళ్ల వద్ద ర్యాలీలు నిర్వహించి, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వచ్చే అనార్థాలతో పాటు జరిగే ప్రమాదాలు, గతంలో జరిగిన ప్రమాదాల్లో రోడ్డున పడిన కుటుంబాల వివరాలు ప్రజలకు తెలియజేస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఒకసారి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తి, మరోసారి పట్టుబడితే ఎలాంటి కేసులు నమోదు చేస్తారనే అంశాలను కుటుంబ సభ్యులకు, సదరు వ్యక్తికి తెలియజేస్తున్నారు.

గత ఆరు నెలల్లో నమోదైన కేసులు..

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జిల్లాలోని ఆయా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గత ఆరు నెలల్లో 2,275 కేసులు నమోదయ్యాయి. కాగా.. 2,519 పేమెంట్ కేసులు అయ్యాయి. కోర్టు ద్వారా రూ.53,95,700 జరిమానాలు, 110 మందికి జైలు శిక్ష విధించారు. ఇందులో చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 767 కేసులు కాగా.. పేమెంట్ కేసులు 860, కోర్టు ద్వారా జరిమానాలు రూ.16,42,000 విధించారు. భువనగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 778 కేసులు కాగా పేమెంట్ కేసులు 836, కోర్టు ద్వారా జరిమానాలు రూ.21,07,770 విధించగా.. ఒకరికి జైలు శిక్ష పడింది. యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 730 కేసులు నమోదు కాగా.. 823 పేమెంట్ కేసులు అయ్యాయి. కోర్టు ద్వారా జరిమానాలు రూ.16,46,000 విధించగా.. 109 మంది జైలు శిక్ష అనుభవించారు. జిల్లా వ్యాప్తంగా 110 మందికి జైలు శిక్ష పడగా.. ఇందులో అధికంగా యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే 109 మంది ఉన్నారు.

దుండగులను శిక్షించాలని రాస్తారోకో



దండుమల్కాపురంలో హైవేపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు, వివిధ సంఘాల నాయకులు

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్‌చేస్తూ గ్రామస్తులు మంగళవారం హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వీరికి వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. రాస్తారోకోతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. విచారణ నిర్వహిస్తున్నామని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భారత సురేందర్‌రెడ్డి, దేప శ్యాంసుందర్, కంచర్ల అశ్విన్‌రెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, ఎస్.రాంరెడ్డి, భూపాల్‌రెడ్డి, అయిలయ్యయాదవ్, ఈశ్వర్, శివకుమార్, బాలరాజు, పబ్బు వంశీ, దిండు భాస్కర్, మునగాల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి నాయకత్వంలోనే అధికారం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు



సాక్షి, యాదాద్రి: బీజేపీ రాష్ట్ర నూతన సారధి కిషన్‌రెడ్డి నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా, టూరిజం శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి పనితీరును గుర్తించి కేంద్ర అధినాయకత్వం బీజేపీ రాష్ట్ర సారథిగా నియమించిందన్నారు. బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనన్నారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కిషన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

విపత్తులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో మంగళవారం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయ బావుల్లో ఈత నేర్చుకోడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయినపుడు, వారిని బయటికి తీసి కృత్రిమ శ్వాస అందించే విధానాలను తెలిపారు. ఈత కొట్టేందుకు వినియోగించే ట్యూబులు, లైఫ్ జాకెట్లు ధరించే విధానం, రోడ్డు ప్రమాద సమయాల్లో ప్రాథమిక చికిత్స, ఉరుముల వల్ల రైతులు రక్షణ పొందే చర్యలను వివరించారు.

ప్రజలను రక్షించడంలో ముందుండేది ఎన్‌డీఆర్‌ఎఫ్

ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ ఆఫీసర్ జహీర్‌ఖాన్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో 15 రోజుల పాటు విపత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మొదటి రోజు పిలాయిపల్లిలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడ విపత్తులు సంభవించినా ప్రజలను రక్షించడంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ముందుంటుందని పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ వీరాబాయి, ఎంపీడీఓ బాలశంకర్, సర్పంచ్ అందెల హరీష్‌యాదవ్, ఎంపీటీసీ బందారపు సుమలతలక్ష్మణ్, ఉపసర్పంచ్ పడాల సతీష్‌చారి, ఎంపీఓ మాజిద్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ముఖేశ్, బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

భువనగిరి : రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఉన్నట్లు గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా ఉన్నాడని, అతడి వయస్సు సుమారు 35 నుంచి 40సంవత్సరాలు ఉంటుందని, తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్, మెడలో చిలుకపచ్చ రంగు కర్చీఫ్ ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడి ఆచూకీకి 8712658619, 8712568454 నంబర్లను సంప్రదించాలని రైల్వే జీఆర్పీ ఇన్చార్జి సత్యనారాయణ సూచించారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. వ్యక్తి దుర్మరణం


కృష్ణయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: ఆటోను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామానికి చెందిన కంబాలపల్లి కృష్ణయ్య(60) చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని ఓ రైస్ మిల్లులో మంగళవారం వడ్లు పట్టించుకొని ఆటోలో కొండమల్లేపల్లిలో ఉంటున్న తన కుమార్తె, అల్లుడి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై గల పెట్రోల్ బంక్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న కృష్ణయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇన్‌స్పెక్టర్ల బదిలీ

యాదగిరిగుట్ట రూరల్: జిల్లాలో పలువురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. యాదగిరిగుట్ట పట్టణ సీఐగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సైదయ్య యాచారం పీఎస్ కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రమేష్‌ను నియమించారు. కాగా.. యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐగా ఎస్.లింగయ్యను నియమిస్తున్నట్లు రాచకొండ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న దిలీప్ కుమార్‌ను చౌటుప్పల్ పీఎస్‌కు అటాచ్ చేశారు. అదేవిధంగా నేరేడుమెట్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సంతోష్ కుమార్‌ను, భువనగిరి రూరల్ పీఎస్ కు ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

భువనగిరి: విధుల్లో నిర్లక్ష్యం, నిర్వహణ లోపాలకు సంబంధించి జిల్లాలో 10 మంది విద్యుత్ ఏఈలకు వార్షిక వేతనంలో ఇంక్రిమెంట్‌లో కోత విధించడంతో పాటు ఇద్దరు ఏఈలకు షోకాజ్ నోటీసులు విద్యుత్ సంస్థ అధికారులు జారీ చేశారు. జిల్లా పరిధిలో 2022– 23కుగాను 12 మండలాల్లో ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు గుర్తించారు. ఇందులో 3,177 త్రిఫేజ్, 545 సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో 17 మండలాలు ఉండగా ఈ పరిస్థితి 12 మండలాల్లో ఉంది. దీంతో రెండు మండలాల ఏఈలకు షోకాజ్ నోటీసులు, 10 మండలాల ఏఈలకు వార్షిక ఇంక్రిమెంట్‌లో కోత విధిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఆయా ఏఈల నుంచి సంజాయిషీ పత్రాలను సైతం స్వీకరించారు.

200 కిలోల గంజాయి పట్టివేత

- ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి మహారాష్ట్రకు తరలించేందుకు యత్నం
- పక్కా సమాచారంతో పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు
- రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఆరుగురు నిందితుల అరెస్ట్, నల్లగొండ జైలుకు తరలింపు
- రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వివరాలు వెల్లడించిన సీపీ డీఎస్ చౌహాన్


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్


పట్టుబడిన గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

చౌటుప్పల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లాలోని సీలేరు ప్రాంతం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తున్న ముఠాను మంగళవారం చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, చౌటుప్పల్ పోలీసులు సంయుక్తంగా ఈ ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ వెల్లడించారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలన్న ఆశతో మహారాష్ట్రలోని పలు జిల్లాలకు చెందిన వివేక్‌మోహన్‌రావు హావెల్స్(36), గణేష్ మారుతీరావు దుమాల్(32), సచిన్ సురేష్‌గడే(32), సంతోష్ బహర్ష్ పుహాడీ(32), సామాట్రే సురేంద్ర మానే(40), బిల్ అశోక్(45) ఒక ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా చేయడం ప్రారంభించారు.

హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు..

ఈ ఆరుగురు ముఠా సభ్యులు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లాలోని సీలేరుకు చెందిన కేశవ్ అనే వ్యక్తి వద్ద రూ.3వేలకు కిలో చొప్పున 200 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని అక్కడే ప్యాకెట్లు రూపంలో మార్చి, వాటిని తమ వెంట తీసుకెళ్లిన మారుతీ ఎర్టిగా, మారుతీ స్విఫ్ట్ కార్లలో లోడ్ చేశారు. హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు తీసుకెళ్లేందుకు ముఠా సభ్యులు అక్కడ నుంచి కార్లలో బయల్దేరారు. మహారాష్ట్రలో కిలో రూ.20వేలకు అమ్మేందుకు ఒప్పందం చేసుకున్నారు.

పక్కా సమాచారంతో పట్టుకున్న పోలీసులు

గంజాయి ముఠా సభ్యులు రెండు వేర్వేరు కార్లలో హైదరాబాద్ వైపునకు వస్తున్నారని ఎస్‌ఓటీ పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు చౌటుప్పల్ పోలీసులతో సమన్వయం చేసుకొని చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన గంజాయి ముఠా సభ్యుల రెండు కార్లను ఆపి ప్రశ్నించగా వారి గుట్టు రట్టయ్యింది. వెంటనే ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు తమ కార్లకు తప్పుడు నంబర్ ప్లేట్లు వినియోగించినట్లు సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. వారి వద్ద 200కిలోల గంజాయి ప్యాకెట్లు, 6సెల్‌ఫోన్లు, రెండు తప్పుడు నంబర్ ప్లేట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను కోర్టులో రిమాండ్ చేసి జైలుకు తరలించినట్లు సీపీ వివరించారు. గంజాయి సరఫరా చేసిన సీలేరుకు చెందిన కేశవ్, మహారాష్ట్రలో కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్న దత్త పరారీలో ఉన్నారు. ఈ విలేకరుల సమావేశంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. ముఠాను పట్టుకున్న పోలీసులను సీపీ అభినందించారు.

బీబీనగర్‌లో 24 కిలోలు..

బీబీనగర్: ములుగు జిల్లా నుంచి సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్‌కు కారులో అక్రమంగా తరలిస్తున్న 24కిలోల గంజాయిని సోమవారం రాత్రి బీబీనగర్ మండలంలోని కొండమడుగు మెట్టు వద్ద స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ యుగేంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చిల్లేపల్లి తండాకు చెందిన సంతోష్ రాథోడ్ జహీరాబాద్ పట్టణంలోని మహీంద్రా కాలనీలో నివసిస్తున్నాడు. ఈజీ మనీకి అలవాటు పడ్డ సంతోష్ రాథోడ్ గంజాయి తరలించి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం గణేష్ రాథోడ్ అనే వ్యక్తి వద్ద నెలకు రూ.25 వేల చొప్పున చెల్లిస్తూ హోండా అమేజ్ కారును అద్దెకు తీసుకున్నాడు. గంజాయిని తరలించేందుకు వీలుగా ఆ కారు డిక్కీలో ఒక ఇనుప పెట్టెను అమర్చాడు. గత మూడు నెలల నుంచి సంతోష్ రాథోడ్ ములుగు జిల్లాకు వెళ్తూ సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద కిలోకు రూ.3500 చెల్లిస్తూ గంజాయి కొనుగోలు చేసి జహీరాబాద్‌కు తీసుకొచ్చి అక్కడ అధిక ధరకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన శేషరావు, ప్రకాశ్‌లకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి కూడా ములుగు జిల్లాకు వెళ్లి 12 ప్యాకెట్లలో 24కిలోల గంజాయిని కొనుగోలు చేసి కారులో బీబీనగర్ మీదుగా జహీరాబాద్‌కు బయల్దేరాడు. పక్కా సమాచారం అందుకున్న బీబీనగర్ పోలీసులు కొండమడుగు మెట్టు వద్ద జాతీయ రహదారిపై కారును అడ్డుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సంతోష్ రాథోడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులతో పంచనామా చేయించి, నిందితుడిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంతోష్ రాథోడ్ వద్ద గంజాయి కొనుగోలు చేసిన ప్రకాశ్, శేషరావు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీబీనగర్‌లో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

బీబీనగర్: బీబీనగర్‌లోని ఎయిమ్స్ సమీపంలో సోమవారం రాత్రి రైలు పట్టాలపై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. భువనగిరి పట్టణంలోని ఆర్బీనగర్‌కు చెందిన దొంతిరెడ్డి పెద్దిరెడ్డి(42) మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా పరిధి నారపల్లిలోని ట్రాక్టర్ షెడ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అదేవిధంగా బీబీనగర్ మండల పరిధిలోని రంగాపురంలో ఎకరం పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. రోజు మాదిరిగా పెద్దిరెడ్డి సోమవారం ఉదయం తన బైక్‌పై భార్యను ఎక్కించుకొని రంగాపురంలోని పొలం వద్ద దించి డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకుండా ఎయిమ్స్ సమీపంలోని రైలు పట్టాల వద్ద బైక్‌ను పార్కింగ్ చేసి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం భార్య ఫోన్ చేస్తే ఇంటికి వస్తున్నాని చెప్పిన పెద్దిరెడ్డి రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించగా ఎయిమ్స్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో బైక్ కనిపించింది. పక్కనే రైలు పట్టాలపై చూడగా పెద్దిరెడ్డి మృతదేహం కనిపించింది. ఇటీవల కుమార్తె పెళ్లి చేసి అప్పుల బాధతోనే పెద్దిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

హుజూర్‌నగర్ వాసి అనుమానాస్పద మృతి

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా గాజువాక సమీపంలోని పంతులుగారి మేడ వద్ద జాతీయ రహదారి పక్కన డివైడర్‌పై సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. మృతదేహాన్ని మంగళవారం గుర్తించిన స్థానికులు గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ కొల్లి సతీష్ సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వద్ద దొరికిన ఆధారాలతో కామిశెట్టి అశోక్(39)గా గుర్తించారు. అశోక్ ముక్కు, నోటి నుంచి రక్తం కారిన ఆనవాళ్లు ఉన్నాయి. అతని జేబులో నిపాన్ సర్వీసెస్‌కు చెందిన గుర్తింపు కార్డు లభించింది. ఆర్టీసీ బస్ అటెండర్‌గా పనిచేస్తున్నట్లు అందులో ఉంది. ఆధార్ కార్డులో అశోక్, తండ్రి వెంకటేశ్వర్లు, డోర్ నంబర్ 12–57, పాత గ్రామపంచాయతీ వెనుక బజార్,


మృతుడి గుర్తింపు కార్డు

హుజూర్‌నగర్, నల్గొండ అనే వివరాలు ఉన్నాయి. అశోక్ ఎలా మృతిచెందాడనే వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తెలుస్తాయని స్థానిక ఎస్ఐ తెలిపారు. మృతుడి వద్ద లభించిన వివరాలతో అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం

మఠంపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ కస్తాల శ్రీను ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని టీవీ, బియ్యం, దుస్తులు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. రూ.50వేల విలువైన సామగ్రి కాలిబూడిదైనట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. కాగా స్థానిక సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి దగ్ధమైన ఇంటిని పరిశీలించి ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.


దగ్ధమైన సామగ్రి

వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు


నల్లగొండ క్రైం: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు నల్లగొండ వన్ టౌన్ సీఐ గోపి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకు చెందిన గారాల శివశంకర్ ఫ్లవర్ డెకరేషన్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శివశంకర్ ఇప్పటికే ముగ్గురిని వివాహం చేసుకోగా, మే 8వ తేదీన బీటీఎస్ ప్రాంతానికి చెందిన బాలికను బలవంతంగా నాలుగో వివాహం చేసుకొని ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి జిల్లా జైలుకు రిమాండ్‌కు తరలించారు. కాగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శివశంకర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి మంగళవారం చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

డిండి: కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం డిండి పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి పట్టణానికి చెందిన నల్లగంతుల లక్ష్మయ్య మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నిరుపేద అయిన లక్ష్మయ్య వచ్చే కూలీ డబ్బులతో సంసారం వెళ్లదీయడం ఇబ్బందికరంగా మారడంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

నల్లగొండ 'డైట్'లో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

నల్లగొండ: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై మంగళవారం నల్లగొండ పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 17 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొంపల్లి విద్యార్థులు మొదటి బహుమతి సాధించగా.. నార్కట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ద్వితీయ బహుమతి, పెద్దవూర ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడో బహుమతి సాధించారు. ప్రథమ స్థానం గెలుచుకున్నవారికి రూ.10 వేలు, ద్వితీయ స్థానం గెలుచుకున్నవారికి రూ.7500, తృతీయ స్థానంలో నిలిచివారికి రూ.5వేల ప్రోత్సాహక బహుమతిగా అందించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అరుంధతి, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, ఎల్‌డీఎం శ్రామిక్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- నల్లగొండ ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ ఎస్పీ అపూర్వరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనగల్ మండలం కేంద్రానికి చెందిన గట్టిగొర్ల అవినాష్ వాట్సాప్‌కి సైబర్ నేరగాళ్లు తక్కువ పెట్టుబడికి ఎక్కువ ఆదాయం వస్తుందని ఆన్‌లైన్ మార్కెటింగ్ మెసేజ్ పంపించారని, దీంతో అతడు మొదట రూ.50వేలు పెట్టుబడి పెట్టగా ఎక్కువ డబ్బులు ఇచ్చి నమ్మకం కల్పించారని పేర్కొన్నారు. అనంతరం అవినాష్ మరింత మొత్తంలో పెట్టుబడి పెట్టగా.. ఆన్‌లైన్ మార్కెటింగ్ యాప్‌లో రూ.90 లక్షలు కనిపిస్తున్నప్పటికీ వాటిని డ్రా చేయడానికి వీలు కాకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడని వివరించారు. వెంటనే సైబర్ క్రైం పోలీసులు సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాను సీజ్ చేసి రూ.19లక్షలు రికవరీ చేశారని ఎస్పీ తెలిపారు. అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లు, మెసేజ్‌లను ఓపెన్ చేసి మోసపోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930, 155260 నంబర్లకు కాల్ చేసి వివరాలు తెలియజేస్తే సైబర్ నేరగాళ్లకు డబ్బులు వెళ్లకుండా సీజ్ చేస్తామన్నారు.

బోనాల మహోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

చౌటుప్పల్ : ఈ నెల 8నుంచి నిర్వహించనున్న శ్రీ ఆంథోల్ మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.మోహన్ బాబు, అభివృద్ధి కమిటీ చైర్మన్ సిద్దిపేట శేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఎలువర్తి యాదగిరి, ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్‌రావు, ఉపసర్పంచ్ మల్కాజిగిరి కృష్ణ, మల్కాజిగిరి బాబు, సుంకరి రమేష్, బొర్ర జంగారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

- Male వార్డెన్స్ వెంటనే కావలెను. సంప్ర॥ ఆల్ఫా జూనియర్ కళాశాల, రామగిరి నల్లగొండ. సెల్ : 9848628045, 7981300357 [YA-2695]
- VISA Consultation overseas Blue & White Colour Jobs. All Profiles Lucrative. Salary High Pay. Interview 3rd to 5th July Hyd & 8 to 11 July Vizag. Ph: 9717618737 [HA-3070]
- ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు వ్రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/–. ఫోన్ : 70756 56208 [V-6179]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph: 9640258899, 9640468899 [H-189303]

Services

మెమో పోయినది

- నల్లమాసు సంధ్యారాణి D/o నాగయ్య R/o చిలుకూరు తేది. 25.06.2023న మా ఇంటి నుండి చిలుకూరు బస్‌స్టాప్‌కి వెళ్లు చుండగా మార్గమధ్యలో నా SSC ఒరిజినల్ మెమో Roll No: 1670023 పోయినది. దొరికిన వారు సంప్ర॥ 9014166739 [Y-784369]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కన్నతల్లిపై కుమారుడి దాడి

- భూమి అమ్మకానికి అడ్డుపడుతున్నదని కర్రతో తలపై కొట్టిన కొడుకు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

కట్టంగూర్: కన్నతల్లిపై కొడుకు దాడి చేసిన ఘటన కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. ఈదులూరు గ్రామానికి చెందిన సులువ లక్ష్మమ్మ భర్త రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆమె తనకు ఉన్న ఇంటి స్థలాన్ని నలుగురు కొడుకులకు 260 గజాల చొప్పున సమానంగా పంచింది. ఇంటి స్థలంతో పాటు తనకున్న ఆస్తిపాస్తులన్నీ సమానంగా ఇచ్చింది. అయితే లక్ష్మమ్మ పెద్ద కుమారుడు నర్సయ్య తన భూమిని ఇతరులకు అమ్ముకుంటానంటే ఆమె అడ్డుపడుతుండడంతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై మంగళవారం నర్సయ్యతో పాటు ఆయన కుమారుడు వినోద్ లక్ష్మమ్మతో మరోసారి గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఆమెను వారిద్దరు కర్రతో కొట్టడంతో కాలు విరిగింది. గ్రామస్తులు లక్ష్మమ్మను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గ్రామ యువత వయోవృద్ధుల టోల్‌ఫ్రీ నంబర్ 14567కు సమాచారం అందించగా, జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి ఆదేశాల మేరకు మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి మునగాల నాగిరెడ్డి లక్ష్మమ్మ వద్దకు వెళ్లి విచారించారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో లక్ష్మమ్మ చేత ఫిర్యాదు చేయించినట్లు నాగిరెడ్డి తెలిపారు. ఇదే విషయమై కట్టంగూర్ ఎస్ఐ రాజును వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని తెలిపారు.

కుటుంబ కలహాలతో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

- భర్త మద్యానికి బానిస కావడంతో తరచూ ఇంట్లో గొడవలు
- కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలుపుకొని తాగిన భార్యాభర్తలు, కుమార్తె
- పరిస్థితి విషమం.. ఖమ్మంలో చికిత్స

కోదాడరూరల్: భర్త మద్యానికి బానిస కావడంతో ఆ ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి కూడా గొడవ జరగడంతో క్షణికావేశంలో భార్యాభర్తలతో పాటు వారి కుమార్తె కూడా కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని గణేష్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన ఎం. రామిరెడ్డి గ్రామంలో వ్యవసాయం చేయడంతో పాటు వరికోత మిషన్ల ఏజెంట్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. రాంరెడ్డి మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. వీరి కుమార్తె సీఏ పూర్తిచేసి ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరి వర్క్ ఫ్రం హోం చేస్తోంది. అమెరికా వెళ్లేందుకు కూడా ప్రయత్నిస్తుంది.

కోదాడకు వచ్చినా మార్పు రాలేదు..

గ్రామం విడిచి వెళ్తేనైనా పరిచయాలు తగ్గి రామిరెడ్డి మద్యం మానేస్తాడని నాలుగు నెలల కిందట కుటుంబం అంతా కోదాడకు వచ్చి గణేష్‌నగర్‌లో నివాసముంటున్నారు. మూడు నెలల వరకు బాగానే ఉన్న అతడు ఇటీవల మళ్లీ మద్యం తాగడం మొదలుపెట్టాడు. నాలుగు రోజుల క్రితం కూడా రాంరెడ్డి మద్యం తాగి ఇంటికి రాగా ఇంట్లో గొడవ జరిగింది. మధ్యలో రెండు రోజులు మద్యం మానేసిన అతడు సోమవారం రాత్రి ఫుల్‌గా తాగి ఇంటికి వెళ్లాడు. అతన్ని చూసిన భార్య, కుమార్తె 'మద్యం తాగొద్దని చెబుతున్నా ఎందుకు తాగుతున్నావు' అంటూ ప్రశ్నించడంతో వారి మధ్య గొడవ మొదలైంది. ఆ తర్వాత గొడవ పెద్దది కావడంతో ఆవేశంలో ముగ్గురూ కలిసి చనిపోదాం అనుకొని రాత్రి 10గంటల సమయంలో కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కొద్దిసేపటి తర్వాత కడుపులో మంట, వాంతులు కావడంతో ఒంటి గంట సమయంలో సమీపంలో నివసిస్తున్న తమ బంధువుకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. అతను అక్కడకు చేరుకొని స్థానికుల సహాయంతో ముగ్గురిని కోదాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళవారం ఉదయం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామిరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. కాగా ఈ ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బీబీనగర్‌లో దొంగల బీభత్సం

- వరుసగా ఏడు ఇళ్లలో చోరీ

బీబీనగర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా ఏడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ కాలనికి చెందిన రొడ్డ యమున ఇంటికి తాళం వేసి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇంట్లోకిచొరబడి తులంన్నర బంగారంతో పాటు రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా సమీపంలోని పొట్ట వెంకటేష్ ఇంట్లో కూడా చొరబడి తులంన్నర బంగారం రూ.18వేల నగదు అపహరించారు. అనంతరం మరో 5 ఇళ్లలో చోరీకి యత్నించగా ఏమీ దొరక్కపోవడంతో అక్కడి నుంచి పారిపోయారు. మంగళవారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేంధర్ తెలిపారు.

కోదాడలో తాళం వేసిన ఇంట్లో..

కోదాడరూరల్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో మంగళవారం తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్‌లోని భారత్ పబ్లిక్ స్కూల్ సమీపంలో నివాసముండే బియ్యం సుబ్రహ్మణ్యం భార్య ఇంట్లోనే చీరల వ్యాపారం చేస్తోంది. మంగళవారం పిల్లలను స్కూల్‌కు పంపిన తర్వాత ఇంటికి తాళం వేసి చీరలు తెచ్చేందుకు విజయవాడకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.60వేల నగదుతో పాటు వెండి ఆభరణాలు దొంగలించారు. వారు తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుడు వెంటనే కోదాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైతు ఉత్పత్తిదారుల క్షేత్రాన్ని సందర్శించిన అధికారులు

చిట్యాల: మండలంలోని పేరేపల్లి గ్రామంలో గల పేరేపల్లి సమగ్ర వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల క్షేత్రాన్ని మంగళవారం తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, అండమాన్ నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక శాఖల అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు, వాటి మార్కెటింగ్ విధానాలను వ్యవసాయ క్షేత్రం సీఈఓ రూపని రమేష్, రైతులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా అధిక దిగుబడులు వచ్చేందుకు చేపడుతున్న చర్యలను, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ విస్తరణ విద్యాసంస్థ ప్రొఫెసర్ డాక్టర్ మధుబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో చిట్యాల శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీ, ఈస్తా సొసైటీ ప్రతినిధి తనుశ్రీ, కర్ణాటక వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకటేష్, అసిస్టెంట్ డైరెక్టర్ బెల్లంకిమెట్ శైలజ, తెలంగాణ, తమిళనాడు, ఏపీ పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ సుకన్య, రీనాక్షి సుందర్‌రాజన్, డాక్టర్ దీపక్ డానియల్, అధికారులు విజయ్ మిల్లర్, రైతులు పాల్గొన్నారు.


పేరేపల్లిలో రైతు ఉత్పత్తిదారుల క్షేత్రంలో వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు

ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి నిరసన సెగ


నిరసన తెలుపుతున్న దళితులు, కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

భువనగిరి : ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డికి నిరసన సెగ తగిలింది. మండలంలోని అనాజీపురం, చందుపట్ల, అనంతారం గ్రామాల్లో మంగళవారం హెల్త్ సబ్ సెంటర్, బీసీ కమ్యూనిటీ హాల్స్, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కాగా మండలంలోని అనంతారం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం గ్రామంలోని వార్డుల్లో పర్యటిస్తుండగా గ్రామానికి చెందిన దళితులు పక్కా గ్రామంలోని దళితులందరికి దళిత బంధు ఇచ్చారని అదే మాదిరిగా తమ గ్రామానికి చెందిన దళితులందరికీ దళిత బంధు ఇవ్వాలని, ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని ఎమ్మెల్యేను పలువురు ప్రశ్నించారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండానే వెళ్తున్న ఎమ్మెల్యేను అడుకునే ప్రయత్నం చేశారు. దళితులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకుని గొడవ కాకుండా చూశారు. బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు జనగాం పాండు దళితుల పట్ల దురుసుగా మాట్లాడి, బెదిరించినట్లు పలువురు ఆరోపించారు. ఎమ్మెల్యే వెంట రైతు సమన్వయ సమితి జిల్లా కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఏదునూరి ప్రేమలత, చిన్నం పాండు, చిందం మల్లికార్జున్, ఎంపీటీసీలు గునుగుంట్ల కల్పనా శ్రీనివాస్, బొక్క కొండల్‌రెడ్డి, సామల వెంకటేష్, జనగా పాండు, ప్రకాష్‌గౌడ్, నాయకులు జక్క రాఘవేందర్‌రెడ్డి, రమేష్, సిల్వేరు మద్దు తదితరులు ఉన్నారు.

పార్ట్‌టైమ్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధించడానికి పార్ట్‌టైమ్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ లక్ష్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్, పీడీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు జూలై 8వ తేదీ లోపు మహిళా ప్రాంగణం వద్ద జిల్లా మహిళా సమాఖ్య భవనంలో గల ఆర్‌సీఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.